
Email : telanganaveenaofficial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..




సంపుటి : 2 | సంచిక : 226 | హైదరాబాద్ | బుధవారం | 14.05.2025 | పేజీలు : 4 | రూ 4/-

## కేటీఆర్‌కు నాయకత్వ బాధ్యతలపై హరీశ్ రావు కీలక వ్యాఖ్యలు



తెలంగాణవీణ, హైదరాబాద్: బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలున్నాయంటూ వస్తున్న ఊహాగానాలకు ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తెరదించారు. పార్టీలో ఎలాంటి వరపోరు లేదని స్పష్టం చేస్తూనే, కేటీఆర్ కు పార్టీ బాధ్యతలు అప్పగించడంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో తనకు, కేటీఆర్‌కు మధ్య విభేదాలున్నాయన్న ప్రచారాన్ని హరీశ్ రావు కొట్టిపారేశారు. ఒకవేళ కేటీఆర్‌కు పార్టీ బాధ్యతలు అప్పగిస్తే తాను తప్పకుండా స్వాగతిస్తానని ఆయన స్పష్టం చేశారు. పార్టీ అధినేత కేసీఆర్ తీసుకునే ప్రతి నిర్ణయాన్ని తాను గౌరవిస్తానని, ఆయన ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటిస్తానని తెలిపారు. "కేసీఆర్‌కు నేను రాముడికి హనుమంతుడిలా క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను. కేసీఆర్ మాటే నా బాట. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఆ గీత దాటే ప్రసక్తి లేదు" అని హరీశ్ రావు స్పష్టం చేశారు. పార్టీలో ఎలాంటి వర విభేదాలు లేవని, అందరం కేసీఆర్ నాయకత్వంలోనే కలిసికట్టుగా పనిచేస్తామని ఆయన తెలిపారు. గతంలోనూ ఈ అంశంపై చాలాసార్లు స్పష్టతనిచ్చానని గుర్తు చేశారు.

# భారత్ మాతాకీ జై'

## నినాదం శత్రువులను వణికిస్తోంది :ఆదంపూర్‌లో ప్రధాని మోదీ



* పంజాబ్‌లోని ఆదంపూర్ ఎయిర్‌బేస్‌లో జవాన్లను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగం
* ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని భారత సైన్యం ప్రతినబూనిందని వెల్లడి
* భారత్ మాతాకీ జై' నినాదం శత్రువులను వణికిస్తోందని వ్యాఖ్య
* ఆపరేషన్ సిందూర్' ద్వారా ప్రపంచానికి భారత పరాక్రమం తెలిసిందన్న ప్రధాని
* భారతీయ మహిళల జోలికొస్తే శత్రువులను ఇంట్లోకి చొరబడి నాశనం చేస్తామని హెచ్చరిక


తెలంగాణవీణ, జాతీయం : పంజాబ్‌లోని ఆదంపూర్ వైమానిక దళ స్థావరంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటించారు. అక్కడ సైనికులను ఉద్దేశించి ఆయన ఉద్వేగభరితంగా ప్రసంగించారు. ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు భారత సైన్యం కృతనిశ్చయంతో ఉందని, ఈ విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. మన డ్రోన్లు, క్షిపణులు శత్రువులను మట్టికరిపించిన వేళ 'భారత్ మాతాకీ జై' నినాదం వారి చెవుల్లో మార్మోగిందని అన్నారు. 'భారత్ మాతాకీ జై' నినాదంతో తన ప్రసంగాన్ని ప్రారంభించిన ప్రధాని, ఈ నినాదం శత్రువుల వెన్నులో వణుకు పుట్టిస్తోందని వ్యాఖ్యానించారు.భారత సైన్యం కనబరిచిన అసామాన్య ధైర్యసాహసాలను ప్రశంసిస్తూ, ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేయాలని మన సేనలు ప్రతిన బూనాయని తెలిపారు. "మన సైన్యం కనబరిచిన శక్తిసామర్థ్యాలకు ఎన్ని ప్రశంసలు చేసినా తక్కువే. అణ్వస్త్రాల ద్వారా బ్లాక్‌మెయిల్ చేసే ప్రయత్నాలను మన సైన్యం అపహాస్యం చేసింది. భారత శక్తిసామర్థ్యాలు చూసి నా జీవితం ధన్యమైంది" అని ఆయన పేర్కొన్నారు. యుద్ధక్షేత్రంలో కూడా 'భారత్ మాతాకీ జై' నినాదాలు మార్మోగాయని, ఆకాశం నుంచి పాతాళం వరకు ఈ నినాదం ప్రతిధ్వనించిందని అన్నారు. ఈ పవిత్ర భూమి నుంచి వీర సైనికులందరికీ సెల్యూట్ చేస్తున్నానని ప్రధాని అన్నారు. "మీ పరాక్రమంతో 'ఆపరేషన్ సిందూర్' నినాదం ప్రపంచమంతా మార్మోగుతోంది. ప్రతి భారతీయుడు సైన్యానికి అండగా నిలబడ్డాడు. భారత సేనలకు యావత్ దేశం కృతజ్ఞతలు తెలియజేస్తోంది" అని మోదీ ప్రశంసించారు. ధర్మసంస్థాపన కోసం ఆయుధం ధరించడం మన సంప్రదాయమని, అదే మన విధానమని ఆయన ఉద్ఘాటించారు. దేశ భద్రత విషయంలో, ముఖ్యంగా మహిళల గౌరవం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ప్రధాని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. "మన అక్కాచెల్లెళ్ల నుదుటి సిందూరం తుడిచిన దుర్మార్గులను, వారి నట్టింట్లోకి చొరబడి మరీ నాశనం చేశాం" అని ఆయన ఉద్వేగపూరితంగా ప్రసంగించారు.

## 11వైమానికస్థావరాలపైభారత్‌దాడిచేసింది : పాకిస్థాన్ డిప్యూటీ పీఎం



తెలంగాణవీణ, అంతర్జాతీయం : భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విషయంలో పాకిస్థాన్ ప్రభుత్వం, అక్కడి రాజకీయ నాయకుల నుంచి పరస్పర విరుద్ధమైన ప్రకటనలు వెలువడుతున్నాయి. ఒకవైపు తమకేమీ నష్టం జరగలేదని, విజయం తమదేనని పాక్ ప్రధాని వంటి ఉన్నత స్థాయి నేతలు ప్రకటిస్తుండగా, మరోవైపు క్షేత్రస్థాయి వాస్తవాలు క్రమంగా బయటకు వస్తున్నాయి. తాజాగా, పాకిస్థాన్ ఉప ప్రధాని చేసిన వ్యాఖ్యలు ఈ అంశంలో కొత్త చర్చకు దారితీశాయి.భారతదేశంతో జరిగిన ఇటీవలి ఘర్షణల నేపథ్యంలో పాకిస్థాన్‌లోని తమ 11 వైమానిక స్థావరాలపై భారత్ పెద్ద ఎత్తున క్షిపణి దాడులు చేసిందని ఆ దేశ ఉప ప్రధాని ఇషాక్ దార్ అంగీకరించారు. ఈ దాడుల్లో పాకిస్థాన్ విమానాలు కూడా దెబ్బతిన్నాయని ఆయన చెప్పారు. అయితే, పాకిస్థాన్‌కు చెందిన ఒక జెట్‌ను భారత్ కూల్చివేసినట్లు స్పష్టమైన ఆధారాలున్నప్పటికీ, తమ జెట్ స్వల్పంగా మాత్రమే దెబ్బతిన్నట్లు ఇషాక్ దార్ పేర్కొన్నారు. భారత పైలట్లు ఎవరూ తమ అదుపులో లేరని కూడా ఆయన స్పష్టం చేశారు.గతంలో, ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్ విజయం సాధించిందని ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. అంతేకాకుండా, పాకిస్థాన్ వ్యాప్తంగా పలువురు ప్రముఖులు, మాజీ క్రికెటర్ అఫ్రిది వంటి వారు పాల్గొన్న విజయోత్సవ ర్యాలీలు కూడా నిర్వహించారు. పాక్ కు జరిగిన నష్టాన్ని భారత్ ఉపగ్రహ చిత్రాలతో సహా స్పష్టంగా చూపిస్తున్నప్పటికీ, తమకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని, పైగా భారత్‌కే తీవ్ర నష్టం కలిగిందని పాకిస్థాన్ ఒక దశలో ప్రచారం చేసింది.

# సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి : ఎంఎల్ఏ మల్లారెడ్డి



తెలంగాణ వీణ, మేడ్చల్ జిల్లా : ముఖ్యమంత్రి సహాయ నిధిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. అలియబాద్ గ్రామానికి చెందిన గండికోట లక్ష్మీ ఆర్థికసాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకుంది. మంజూరి అయిన చెక్కును ఎమ్మెల్యే మల్లా రెడ్డి, శామీర్ పేట్ జడ్పీటీసీ అనిత లాలయ్య చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేశారు.

# నాచారం సిఐని కలిసిన తార్నాక టు వీలర్స్ మెకానిక్స్ ఆటోమొబైల్స్ అసోసియేషన్ సభ్యులు




తెలంగాణ వీణ/నాచారం: తార్నాక స్కూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగ్ రావు ప్రధాన కార్యదర్శి భీమ్ రెడ్డి ఆధ్వర్యంలో నాచారం పోలీస్ స్టేషన్ సిఐ రుద్వీర్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమకు సంబంధించిన ఎలాంటి సమస్యలు ఉన్న పోలీసులు సహకరించాలని దానితోపాటు ప్రజలు వాహనాల ఇబ్బందులతో వస్తే తమ దృష్టి కి తీసుకువస్తే వాహనాలు రిపేర్లకు గురైతే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే మరమ్మత్తులు చేస్తామని అసోసియేషన్ సభ్యులు పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ యూసఫ్,షేక్ మీర్ పాషా,మల్లికార్జున్, మహమ్మద్ ఖాన్, జాయింట్ సెక్రెటరీ లక్ష్మణరావు, ట్రెజరర్ శంకర్, హెచ్ ఎం టి ఖాన్ భాయ్,రఘు రామ్ , జహంగీర్, భాను, లింగాల సాయినాథ్ ,నాచారం మెకానిక్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చేగుంట కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు, స్టాలిన్ నర్సింలు కి పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు





తెలంగాణ వీణ/ చేగుంట : మెదక్ జిల్లా చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ ఆధ్వర్యంలో చేగుంట కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు స్టాలిన్ నర్సింలు, జ్యోతి, దంపతులకు 16 వ వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేసి శాలువా తో సన్మానం చేయడం జరిగింది, ఈ కార్యక్రమం లో ఉపాధ్యక్షులు మసాయి పెట్ శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ కొండి శ్రీనివాస్, ముజామిల్, మహేష్, ఓబీసీ అధ్యక్షులు అన్నం ఆంజనేయులు, ఫిషర్ మ్యాన్ అధ్యక్షులు సోమా వెంకటేష్, యూత్ అధ్యక్షులు మోహన్ నాయక్, సినియర్ నాయకులు కాషాబోయిన శ్రీనివాస్ కర్నె బాబు, కొండి స్వామి,,యాదగిరి, సోమా రాజు,రవీందర్, శ్రీను, ఫరీద్, నవీన్, తదితరులు పాల్గొన్నారు

# బిజెపి రాష్ట్ర నాయకులు అంబాల పద్మా రెడ్డి మృతికి మాజీ మేయర్ సంతాపం



తెలంగాణ వీణ/తార్నాక: బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంపాల పద్మా రెడ్డి మృతి పట్ల మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి సంతాపం తెలియజేశారు. నాచారం కు చెందిన అంపాల పద్మా రెడ్డి క్యాన్సర్ బారిన పడి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మేయర్ నాచారంలోని పద్మా రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన ప్రార్థివ దేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. పద్మా రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి, పరామర్శించి సానుభూతి ప్రకటించారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఉన్న పద్మా రెడ్డి అకాల మరణం పార్టీకి తీరని లోటు అన్నారు. అనంతరం జరిగిన పద్మా రెడ్డి అంతిమయాత్రలో మాజీ మేయర్ కార్తిక రెడ్డి తో పాటు బిజెపి నాయకులు బండ చంద్రారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు

# అంపాల పద్మా రెడ్డి మరణం సమాజానికి, బిజెపి పార్టీకి తీరని లోటు.

## ప్రార్థివ దేహానికి శ్రద్ధాంజలి ఘటించిన ఎన్వీ ఎస్ ఎస్ ప్రభాకర్. పోతగాని గోపాల్ గౌడ్..



తెలంగాణ వీణ/నాచారం: కరుడుగట్టిన జాతీయవాది,స్వయం సేవక్ గా, రాజకీయ నాయకుడిగా,సామాజిక కార్యకర్తగా,నాచారం ప్రజలకు ,ఉప్పల్ నియోజకవర్గ పౌరులకు ,రంగారెడ్డి జిల్లా కార్యకర్తలకు,పూర్వ నల్గొండ జిల్లాలో అనేకమందికి సేవలందించిన మిత్రుడు అంపాల పద్మా రెడ్డి మరణం సమాజానికి, బిజెపికి ,నాచారానికి తీరని లోటు.వారి ఆత్మకు సద్గతి ప్రాప్తించాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తు.

శోకతప్త హృదయంతో నివాళులు అర్పించటం జరిగింది. ఈ సందర్భంగా పద్మారెడ్డి పార్థివదేహం పై బిజెపి పార్టీ జెండాను కప్పి నివాళులు అర్పించిన బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్వీ ఎస్ ఎస్ ప్రభాకర్. మాజీ ఎమ్మెల్సీ, రామచందర్ రావు, ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య పార్థివదేహంకు నివాళులు అర్పించటం జరిగింది. అదేవిదంగా పద్మారెడ్డి కుటుంబ సభ్యులను ఫోన్ కాల్ ద్వారా పరామర్శించి సానుభూతి తెలిపిన కేంద్ర మంత్రివర్యులు జి. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్,హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ, త్రిపుర రాష్ట్ర గవర్నర్ నాళ్లు ఇంద్రసేన రెడ్డి. అంతిమయాత్ర లో పాల్గొన్న మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్,ఉప్పల్ నియోజకవర్గం బీజేపీ పార్టీ నాయకులు అభిమానులు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళల వీడియోలు తీసి లైంగిక వేధింపులు

## - 9మందికి జీవిత ఖైదు వేసిన కోర్టు



తెలంగాణవీణ, జాతీయం : తమిళనాడులో సంచలనం సృష్టించిన 2019 నాటి పొల్లాచ్చి లైంగిక వేధింపుల కేసులో మహిళా కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న 9మందిని దోషులుగా తేలుస్తూ జీవిత ఖైదును విధించింది కోయంబత్తూర్‌లోని సెషన్స్ కోర్టు. అంతేకాకుండా ఒక్కొక్కరికి రూ.1.5 లక్షలు జరిమానాను విధించింది. ఈ కేసులో బాధితులకు రూ.85 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. A1 – శబరిరాజన్, A2 – తిరునావుక్కరసు, A3 – సతీశ్, A4 – వసంతకుమార్, A5 – మణివన్నన్, A6– బాబు, A7 – హారనిమాస్పాల్ , A8 – అరులానందం, A9– అరుణ్‌కుమార్ నిందితులుగా ఉన్నారు. ఈ తొమ్మిది మంది 2019 నుంచి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. వారిని మంగళవారం కట్టుదిట్టమైన భద్రతతో సెషన్స్ కోర్టుకు తీసుకొచ్చారు. ఇప్పటికే వారిపై ఆగ్రహంతో ఉన్న ప్రజలు వారిపై దాడి చేస్తారనే భయంతో కోర్టు దగ్గర భారీగా పోలీసులు మోహరించారు. ఈ కేసు విచారణలో భాగంగా న్యాయస్థానం వీరందరినీ దోషులుగా తేల్చుతూ మధ్యాహ్నం వీరికి జీవితఖైదు శిక్షను ఖరారు చేసింది. ఇక ఈ తీర్పుపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ స్పందిస్తూ నేరస్థుల దురాగతాలను న్యాయం జరిగిందని అన్నారు.



# కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో కొత్త రూల్స్..

తెలంగాణవీణ, సినిమా : ప్రపంచ సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే ప్రతిష్ఠాత్మక 78వ కేన్స్ చిత్రోత్సవాలు నేడు (మే 13)న ఫ్రాన్స్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అయితే, ఈ ఏడాది రెడ్ కార్పెట్‌పై వస్త్రధారణ విషయంలో నిర్వాహకులు కొన్ని కీలకమైన, కఠినమైన నిబంధనలను ప్రవేశపెట్టారు. దీని ప్రకారం, రెడ్ కార్పెట్‌పై పూర్తి నగ్నత్వాన్ని ప్రదర్శించడం, అలాగే అతిగా, పెద్దవిగా ఉండి ఇతరులకు అసౌకర్యం కలిగించే దుస్తులను ధరించడాన్ని అధికారికంగా నిషేధించారు. ఈ నిర్ణయం ఫ్యాషన్ ప్రపంచంలో మరియు సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.గత కొన్నేళ్లుగా కేన్స్ రెడ్ కార్పెట్‌పై చోటుచేసుకున్న కొన్ని సంఘటనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 2022లో ఉక్రెయిన్‌కు మద్దతుగా ఓ మహిళా నిరసనకారిణి అర్ధనగ్న ప్రదర్శన చేయడం, అలాగే ఈ ఏడాది జరిగిన గ్రామీ అవార్డుల వేడుకలో ప్రముఖ డిజైనర్, నటి బియాంక సెన్సోరి ధరించిన అతి తక్కువ దుస్తులు తీవ్ర వివాదాస్పదం కావడం వంటివి ఈ నూతన నిబంధనల రూపకల్పనకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. కేన్స్ ఫెస్టివల్ నిర్వాహకులు తమ సంస్థాగత నియమావళి, ఫ్రెంచ్ చట్టాలకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. అంతేకాదు, నగ్నత్వంతో పాటు, ఇతరుల కదలికలకు ఆటంకం కలిగించే లేదా స్క్రీనింగ్ రూమ్‌లలో సీటింగ్ ఏర్పాట్లకు ఇబ్బంది కలిగించేంత భారీ దుస్తులు ధరించిన వారికి ప్రవేశం నిరాకరించే హక్కు ఫెస్టివల్ నిర్వాహకులకు ఉంటుందని కూడా స్పష్టం చేశారు. ముఖ్యంగా, నేలపై అతి పొడవుగా విస్తరించి ఉండే గౌన్ల ట్రైల్స్ ఉన్న దుస్తులు ఈ నిషేధం పరిధిలోకి వస్తాయి. అలాగే, గాలా స్క్రీనింగ్‌ల సమయంలో పెద్ద టోట్ బ్యాగులు, బ్యాక్‌ప్యాక్‌లు వంటివి కూడా రెడ్ కార్పెట్‌పైకి అనుమతించబడవు.

## ఆపరేషన్ సిందూర్ సినిమా కన్ఫార్మ్ - ఫస్ట్ పోస్టర్ రిలీజ్




తెలంగాణవీణ, సినిమా : ఆపరేషన్ సిందూర్' ప్రస్తుతం భారత్‌లో మార్మోగిపోతున్న పేరు. పాకిస్థాన్ ఉగ్రమూకలపై భారత్ త్రివిధ దళాలు చేపట్టిన ఈ మిషన్ విజయవంతంగా సాగుతోంది. అయితే ఈ పవర్‌ఫుల్ పేరుతో ఓ సినిమా రానుంది. 'ఆపరేషన్ సిందూర్' టైటిల్‌తో మూవీ కన్ఫార్మ్ అయినట్లు బాలీవుడ్ నిర్మాణ సంస్థ నిక్కీ విక్కీ భగ్నానీ ఫిల్మ్స్ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా రిలీజ్ చేసింది.తాజా పోస్టర్‌లో ఆర్మీ యూనిఫాం ధరించిన మహిళ నుదుటన సిందూరం పెట్టుకుంటున్నట్లు చూపించించారు. చేతిలో రైఫిల్, బ్యాక్‌గ్రౌండ్‌లో ఫైటర్ జెట్, మండుతున్న యుద్ధ భూమితో పోస్టర్‌ను పవర్‌ఫుల్‌గా డిజైన్ చేశారు. ప్రస్తుతం భారత్ - పాక్‌ల మధ్య జరుగుతున్న ఉద్రిక్తతలు, కశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో సినిమా తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమాకు ఉత్తమ్ నితిన్ దర్శకత్వం వహించనున్నారు.కాగా, చిత్రంలో నటించనున్న నటీనటుల వివరాలను ఇంకా వెల్లడించలేదు. త్వరలోనే కాస్ట్ అండ్ క్రూ పేర్లను ప్రకటించే అవకాశం ఉంది. అయితే భారత్ ప్రభుత్వం ఈ ఆపరేషన్ చేపట్టినప్పటి నుంచి ఈ టైటిల్ హక్కుల బాలీవుడ్‌లోని ప్రముఖ నిర్మాణ సంస్థలు పోటీ పడ్డాయి. ఇండియన్ మోషన్ పిక్చర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్‌లో జీ- స్టూడియోస్, టీ- సిరీస్ లాంటి ప్రముఖ బ్యానర్‌లు కూడా దరఖాస్తు చేసుకున్నాయి. చివరకు నిక్కీ విక్కీ భగ్నానీ ఫిల్మ్స్ సంస్థకు టైటిల్ రైట్స్ దక్కాయి.







# అహ్మదాబాద్‌లో ఐపీఎల్ ఫైనల్..?



తెలంగాణవీణ,క్రీడలు : భారత్, పాకిస్థాన్ మధ్య సరిహద్దు ఉద్రిక్తతల కారణంగా ఒక వారం పాటు నిలిచిపోయిన ఐపీఎల్ తాజా సీజన్ ఈ నెల 17న తిరిగి ప్రారంభం కానుంది. ఆరు వేదికల్లో మే 17 నుంచి 27 వరకు మిగిలిన లీగ్ మ్యాచ్ లు జరగనున్నాయి. ఆ తర్వాత మే 29 నుంచి ప్లేఆఫ్ మ్యాచ్ లు ప్రారంభమవుతాయి. మే 29న క్వాలిఫయర్-1, మే 30న ఎలిమినేటర్, జూన్ 1న క్వాలిఫయర్-2, జూన్ 3న ఫైనల్ జరగనున్నాయి. ఈ మేరకు బీసీసీఐ సవరించిన షెడ్యూల్‌ను నిన్న విడుదల చేసిన విషయం తెలిసిందే. మిగిలిన లీగ్ మ్యాచ్‌ల కోసం జైపూర్, ముంబయి, బెంగళూరు, లక్నో, అహ్మదాబాద్, ఢిల్లీ వేదికలను ఖరారు చేసింది. ఇలా లీగ్ మ్యాచ్ ల వేదికలు ఇప్పటికే నిర్ణయించబడినప్పటికీ, ప్లేఆఫ్‌లను నిర్వహించే వేదికలను బీసీసీఐ ఇంకా ప్రకటించలేదు.అయితే, తాజా నివేదికల ప్రకారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో క్వాలిఫయర్ 2తో పాటు ఫైనల్‌ను నిర్వహించాలని బీసీసీఐ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. కోల్‌కతా వేదికగా జరగాల్సిన ఈ మ్యాచ్‌ను ఇక్కడికి మార్పు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, వాతావరణ సూచన ఆధారంగా ఈ ప్రణాళికలు మారవచ్చని సమాచారం. బోర్డు ప్రస్తుతం వేదికల వద్ద వర్షం పడే అవకాశాలను పర్యవేక్షిస్తోంది. ఈ నేపథ్యంలో జూన్ ప్రారంభంలో అహ్మదాబాద్‌లో ఎటువంటి వర్షాలు ఉండవని భావించి, ఇదే వేదికలో ఫైనల్ నిర్వహించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక, క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్ విషయానికి వస్తే ముంబయి వేదిక ఒక చాయిస్ గా ఉంది. కానీ, ఇది దేశంలో రుతుపవనాల రాకపై ఆధారపడి ఉంటుందని 'క్రిక్‌బజ్' పేర్కొంది. కొన్ని రోజుల క్రితం వాణిజ్య రాజధానిలో భారీ వర్షాలు కురిశాయి. అటు ఇదే సమయంలో వర్షం ప్రభావం అంతగా ఉండని ఢిల్లీ, జైపూర్ వంటి ఉత్తర భారత వేదికలను బీసీసీఐ ఎంచుకునే అవకాశం ఉందని సమాచారం.


# రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలకు ఘనమైన వీడ్కోలు

## పలికితే బాగుండేది: అనిల్ కుంబ్లే



తెలంగాణవీణ,క్రీడలు : భారత క్రికెట్ జట్టు ఇంగ్లండ్ పర్యటనకు సిద్ధమవుతున్న కీలక తరుణంలో, సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి టెస్ట్ క్రికెట్ నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించడం క్రీడా ప్రపంచాన్ని విస్మయానికి గురిచేసింది. మే 7న రోహిత్ శర్మ, ఆ తర్వాత కొద్ది రోజులకే మే 12న విరాట్ కోహ్లి సోషల్ మీడియా ద్వారా తమ రిటైర్మెంట్ నిర్ణయాలను వెల్లడించారు. ఈ ఇద్దరు దిగ్గజ క్రికెటర్లకు మైదానంలో ఘనంగా వీడ్కోలు పలికి ఉండాల్సిందని భారత జట్టు మాజీ కెప్టెన్, స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే అభిప్రాయపడ్డారు.కొద్ది రోజుల తేడాతో ఇద్దరు కీలక ఆటగాళ్లు టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని కుంబ్లే తెలిపారు. "ఇద్దరు మేటి క్రికెటర్లు ఒకరి తర్వాత మరొకరు ఇలా రిటైర్మెంట్ ప్రకటించడం నిజంగా నన్ను ఆశ్చర్యపరిచింది. ముఖ్యంగా విరాట్ కోహ్లి విషయంలో ఇది ఊహించలేదు. అతనిలో ఇంకా కొన్ని సంవత్సరాలు టెస్ట్ క్రికెట్ ఆడే సత్తా ఉంది" అని కుంబ్లే పేర్కొన్నారు."ఇది నిజంగా నిశ్శబ్ద నిష్క్రమణ అనే చెప్పాలి. రోహిత్, కోహ్లీలకు మైదానంలో, ప్రేక్షకుల సమక్షంలో వీడ్కోలు లభించి ఉంటే బాగుండేది. గతంలో రవిచంద్రన్ అశ్విన్ కూడా సిరీస్ మధ్యలోనే తన రిటైర్మెంట్‌ను ప్రకటించాడు. నా అభిప్రాయం ప్రకారం, అశ్విన్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి... ఈ ముగ్గురికీ మైదానంలో ఘనంగా వీడ్కోలు జరిగి ఉండాల్సింది" అని ఆయన అన్నారు.ఇంగ్లండ్‌తో జరగబోయే టెస్ట్ సిరీస్‌పై ఈ రిటైర్మెంట్ల ప్రభావం గురించి కూడా కుంబ్లే విశ్లేషించారు. "ఈ సిరీస్‌లో విరాట్ కోహ్లి కీలక ఇన్నింగ్స్‌లు ఆడతాడని నేను ఆశించాను. కానీ, అతను అనూహ్యంగా టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఇది సెలెక్టర్లకు కూడా ఒక సవాలుతో కూడుకున్నదే. ఇంగ్లండ్ గడ్డపై ఐదు టెస్టుల సిరీస్ ఆడటం అంత సులభం కాదు. ఇది ఎన్నో కఠిన సవాళ్లను విసురుతుంది. రోహిత్, కోహ్లీల నిర్ణయాలు సెలెక్టర్లను కూడా ఆశ్చర్యానికి గురిచేసి ఉంటాయని నేను భావిస్తున్నాను" అని కుంబ్లే వివరించారు.విరాట్ కోహ్లి రిటైర్మెంట్‌పై టీమిండియా పేసర్ మహ్మద్ సిరాజ్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, "టెస్ట్ క్రికెట్‌లో నీ అద్భుతమైన కెరీర్‌కు అభినందనలు. నీ వారసత్వం ఎప్పటికీ నిలిచి ఉంటుంది" అని పోస్ట్ చేశాడు. మరో సీనియర్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ కూడా, "ఇకపై డ్రెస్సింగ్ రూంలో నువ్వు లేకపోవడం పెద్ద లోటు. నాకు ఎల్లప్పుడూ మద్దతుగా నిలిచి, ప్రోత్సహించినందుకు కృతజ్ఞతలు. ఆల్ ది బెస్ట్, కింగ్ విరాట్ కోహ్లి భయ్యా" అని తన స్పందనను తెలియజేశారు.

## బృందావనంలో విరాట్ కోహ్లి దంపతులు..



తెలంగాణవీణ,క్రీడలు : టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన ఒక రోజు తర్వాత భారత స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లి మంగళవారం తన భార్య అనుష్క శర్మతో కలిసి యూపీలోని బృందావన్ చేరుకున్నాడు. ఈ జంట ప్రముఖ ఆధ్యాత్మిక గురువు ప్రేమానంద్ మహారాజ్‌ను బృందావన్ ధామ్‌లో కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా సెలబ్రిటీ కపుల్‌కు ఆయన ఆధ్యాత్మిక బోధనలు చేశారు. గతంలో కూడా కోహ్లి దంపతులు తమ పిల్లలతో కలిసి బృందావనానికి వెళ్లిన విషయం తెలిసిందే. దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక గురువులలో ప్రేమానంద్ ఒకరు. ఇక, కోహ్లి తన 14 ఏళ్ల అద్భుతమైన టెస్ట్ కెరీర్‌కు సోమవారం ముగింపు పలికాడు. తన టెస్ట్ కెరీర్‌లో టీమిండియా తరఫున 123 మ్యాచ్‌లు ఆడాడు. 46.85 సగటుతో 9,230 పరుగులు చేశాడు. ఇందులో 30 సెంచరీలు, 31 అర్ధ సెంచరీలు ఉన్నాయి. అత్యధిక వ్యక్తిగత స్కోరు 254 (నాటౌట్). సచిన్ టెండూల్కర్ (15,921), రాహుల్ ద్రవిడ్ (13,265), సునీల్ గవాస్కర్ (10,122 పరుగులు) తర్వాత ఈ లాంగ్ ఫార్మాట్‌లో భారత్ తరఫున అత్యధిక పరుగులు సాధించిన నాలుగో ఆటగాడు కోహ్లీనే.2011 జూన్ లో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌తో కోహ్లి తన టెస్ట్ అరంగేట్రం చేశాడు. తన తొలి టెస్ట్ పర్యటనలో ఐదు ఇన్నింగ్స్‌లలో కలిపి కేవలం 76 పరుగులే చేసి తీవ్రంగా నిరాశపరిచాడు. అయినప్పటికీ ఆ తర్వాత విరాట్ టీమిండియాలో కీలక ప్లేయర్‌గా ఎదిగాడు. ప్రత్యేక బ్యాటింగ్ స్టైల్‌తో తనకంటూ ఒక పేరు తెచ్చుకున్నాడు.